


3 నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 3నుంచి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. ఈ పథకం అమలుపై తమ ఛాంబర్‌లో డిఇఒ యు.మాణిక్యం నాయుడు, ఆర్ఐఒ ఎం.ఆదినారాయణతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో 18 ప్రభుత్వ ఇంటర్‌మీడియట్ కళాశాలలు ఉన్నాయని, వీటిలో 2,650 మంది మొదటి సంవత్సరంలో, 2010 మంది ద్వితీయ సంవత్సరంలో, మొత్తం 4660 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఈ 18 కళాశాలల్లో 9 కళాశాలల్లో అక్షయపాత్ర ఫౌండేషన్, మిగిలిన 9 కళాశాలల్లో ఆయా కళాశాలలకు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పథకం నిర్వహిస్తున్న ఎస్‌హెచ్‌జి గ్రూపుల ద్వారా భోజనం సిద్ధం చేస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం, రుచికరంగా భోజనాన్ని తయారుచేసి విద్యార్థులకు అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

కోటి ఆశలతో కొత్త సంవత్సరంలోకి..

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గిర్రున తిరిగే కాలచక్రంలో 2024వ సంవత్సరం చరిత్ర పుటల్లోకి వెళ్లిపోయింది. 2025వ సంవత్సరం కొన్ని గంటల మునుపు రానే వచ్చేసింది. గడిచిపోయిన సంవత్సరానికి వీడ్కోలు చెప్తూ... 2025వ ఏటకు స్వాగతం పలుకుతూ జనం ఒకింత ఉత్సాహంతో కేరింతల నడుమ కేకులు కట్ చేస్తున్నారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటున్నారు. ఈ ఏడాదంతా మంచి జరగాలని ఆకాంక్షిస్తూ పరస్పర పలకరింపులు, వాట్సాప్ మెసేజ్‌లు మంగళవారం అర్ధరాత్రి నుంచే మొదలయ్యాయి. ఇదంతా షరా మామూలే. నూతన సంవత్సర వేడుకలు ఎప్పుడూ జరుగుతున్నవే. కానీ, నూతన సంవత్సరంలో అడుగుపెడుతున్న వేళ కొత్త ఆశలు మొలకెత్తాయి. అందుకు తగ్గట్టే ప్రణాళికలు రూపొందించు కుంటున్నారు.

- గ్రీటింగ్స్ పోయి సోషల్ మీడియా వచ్చే
- మంచి జరగాలనే కోరికలు
- అవరోధాలను ఎదుర్కొనేందుకు ప్రణాళికలు

ఈ ఏడాది వ్యాపారంలో విస్తరించాలని, వృద్ధిచెందాలని కొందరు.. ఉపాధి, ఉద్యోగాలు సాధించాలని మరికొందరు.. ఉద్యోగోన్నతి, పదోన్నతులు చేపట్టాలని ఇంకొందరు.. తమ కష్టనష్టాలు తీరాలని ఇంకొందరు ఆకాంక్షించడం నూతన సంవత్సరం మొదలైనవేళ పరిపాటి. గడిచిన ఏడాదిలో పెరిగిన నిత్యవసర సరుకుల ధరలు, మునుపెన్నడూ లేనంతగా పెరిగిన విద్యుత్ ఛార్జీలు ఒకింత కలవరపాటుకు గురిచేస్తున్నాయి. అక్టోబరులో నెలకున్న వర్షాభావంతో కొంతమంది, డిసెంబరులో వరి పంట చేతికందిన సమయంలో కురిసిన భారీ వర్షాలతో రైతులు కష్టనష్టాలను చవిచూశారు. ప్రభుత్వ విధానాలతో పలు రకాల వ్యాపారులు, వృత్తిదారులు తమ ఉనికిని కోల్పోయే పరిస్థితి దాపురించింది. ఈనేపథ్యంలో కొత్త సంవత్సరంలోనైనా తమ సమస్యలు పరిష్కారం కావాలని ఉద్యోగులు, ప్రకృతి కరుణించాలని, ఇప్పటికే జరిగిన నష్టాల నుంచి గట్టెక్కించేందుకు ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలని రైతులు కోరుకుంటున్నారు. ముఖ్యంగా, ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్నం భోజన కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఈ ఏడాదైనా రాజకీయ వేధింపులు, పొట్టకొట్టే చర్యలు తప్పాలని కోరుకుంటున్నారు.

ఇవేవీ గొంతెమ్మ కోర్కెలు కాకపోయినప్పటికీ నూతన సంవత్సరంలోకి అడుగిడుతున్న వేళ ప్రతి ఒక్కరిలోనూ కొత్త ఆశలు, ఆలోచనలు, కొంగొత్త ఆకాంక్షలు మనసులో మెదలడం సహజమే. నూతన సంవత్సర మొదలు కాగానే ఏడాది పొడవునా తమ ఎదుగుదలకు, ఆలోచనలకు ఆటకంగా మారుతున్న అలవాట్లను వదిలించుకోవాలని, సవాళ్లను ఎదుర్కోవాలని చాలా మంది భావిస్తారు. మరికొందరు కొంగొత్త ప్రణాళికలు రూపొందించుకుని, కార్యసాధన కోసం కంకణ బద్ధులయ్యేందుకు సన్నద్ధమౌతారు. సాదాసీదాగా సాగి పోతున్న జీవితంలో నూతన సంవత్సరం కొత్త జోష్ నింపాలని కొందరు కోరుకుంటారు. ఈ మాటకొస్తే... కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్నామనే ఆలోచనలు ముఖ్యంగా కుర్రకారులో ఒకింత నూతనోత్తేజాన్ని కలిగిస్తుంది. వారం పది రోజుల ముందు నుంచే నూతన సంవత్సరంలో ప్రారంభించబోయే పనులు, లక్ష్యాల గుర్తించి సమగ్ర ప్రణాళిక రూపొందించుకుంటారు. అయితే గతంతో పోలిస్తే నూతన సంవత్సర వేడుకలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. గ్రీటింగు, టెలిఫోన్ సమాచారాల ద్వారా శుభాకాంక్షలు తెలుపుకునేవారు. అంతకు మునుపు వారం రోజుల ముందు నుంచే గ్రీటింగుల పంపే క్రమంలో పోస్టాఫీసులు కిటకిటలాడేవి. ఈ ఇప్పుడా పరిస్థితి లేదు. సప్తసముద్రాలు దాటివున్నవారు కూడా కంప్యూటర్ లేదా ల్యాప్‌ట్యాప్ ద్వారా వీడియో కాన్ఫరెన్సులో కలుసుకునే పరిస్థితి కొన్నేళ్ల కిందటే వచ్చేసింది. ఇప్పుడు మరింతగా పెరిగింది. ఇక అతిథులను, పెద్దలను కలుసుకునే క్రమంలో పుష్పగుచ్ఛాలు, పండ్లు, స్వీట్లు అందజేసుకోవడం ఆనవాయితీగా సాగుతోంది. కేక్ కటింగ్ షరా మామూలే. ఈ క్రమంలో పండ్లు, స్వీటు దుకాణాలు, బేకరీలు, రంగులు విక్రయించే షాపులు సందడిగా కనిపించాయి. ముందస్తు ఆర్డర్లతో వ్యాపారులు బిజీబిజీగా మారారు. ఇక మందుబాబుల హడావుడి కొన్నేళ్లగా హద్దులు దాటుతోంది. మద్యం దుకాణాల వద్ద బారులు తీరారు. ఏదైనా ఈ హడావుడి ఈ ఒక్కరోజే. నూతన సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా జనం మనసుల్లో మెలిగే ఆశలు, ఆకాంక్షలు, కొత్తకొత్త ఆలోచనలు ఆచరణాత్మకం కావాలని, మంచి ఫలితాలను ఇవ్వాలని, ముఖ్యంగా పుట్టెడు సమస్యలతో సతమతమౌతున్న రైతులు, ఉద్యోగులు, స్కీమ్‌వర్కర్లు, చిరువ్యాపారుల కష్టాలు తీరాలని, అందరికీ మేలు జరగాలని, మంచి ఆరోగ్యం సిద్ధించాలని ఆకాంక్షిద్దాం



ఆరు ఆకాంక్షలతో 2025కు స్వాగతం

సామాజిక సేవకులు మక్కువ చంద్ర కళాధర్ 2025 సంవత్సరానికి వినూత్నంగా స్వాగతం పలికారు. ప్రజలంతా ఆరోగ్యంగా, ఐశ్వర్యంతో, ఆనందంగా, విజ్ఞానవంతంగా, శుభాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కళాధర్ తన ఆశాభవం వ్యక్తం చేశారు.

తెలుగు ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్



తెలుగు ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం వలన నూతన సంవత్సరానికి ముందుగానే పండగ వాతావరణం నెలకొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నదుల అనుసంధానం ప్రాజెక్టు 2025 లో విజయవంతంగా ప్రారంభమై ప్రజల మనసులో చెరగని ముద్ర వేయడం ఖాయమన్నారు. ఈ నూతన సంవత్సరం తెలుగు రాష్ట్రాల్లో తెలుగువారంతా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలి. తెలుగు వారందరి మోములలో 2025 సంవత్సరం వెలుగులు నింపాలి. వారి జీవితాలలో సకల శుభాలు జరగాలి.

జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలి

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్



జిల్లా ప్రజలకు నూతన సంవత్సరంలో మంచి జరగాలి. ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.. కొత్త సంవత్సరం లో అందరూ ఆనందంతో ఆరోగ్యంతో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని కోరుకుంటున్నాను. ప్రజలందరి జీవన ప్రమాణాలు మరింతగా మెరుగు పడాలని ఆకాంక్షిస్తున్నాను.

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. రాబోయే 2025లో ప్రజలంతా సుఖ సంతోషాలతో సిరిసంపదలతో ఉండాలి. జిల్లా అంతా అభివద్ధి పథంలో నడవాలి. గత ప్రభుత్వంలో వైసిపి అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లోనూ విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి ప్రభుత్వ పాలన మొత్తం పేద ప్రజలకు అండగా నిలిచారు. నేడు రాష్ట్ర ప్రజలకు భరోసా ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ప్రజలకు భరోసా ఇచ్చే పథకాలను అమలు చేయడంలో కుటుంబ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

అభివృద్ధికి సహకరించాలి : కమిషనర్ నల్లనయ్య



నగర ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు, నగరపాలక సంస్థ సిబ్బందికి నూతన శుభాకాంక్షలు. కొత్త ఏడాదిలో నగర ప్రజలకు అంతా మంచి జరగాలి. నగర అభివృద్ధికి అందరూ సహాయ, సహకారాలు అందించాలని కోరుకుంటున్నాను.

నగర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

మేయర్ విజయలక్ష్మి



నూతన సంవత్సర సందర్భంగా నగర ప్రజలకు అధికారు లకు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2025లో అందరికీ మంచి జరగాలి. అన్ని రంగాలు అభివృద్ధి చెందాలి.

టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితా విడుదల

- ఆరు జిల్లాల్లో 21,555 మంది ఓటర్లు
- పురుషులు 12,948 • మహిళలు 8,607
- అత్యధికంగా విశాఖ జిల్లాలో 5,277 మంది ఎక్కువ
- 2019 కంటే 1968 మంది అధికం

ప్రజాశక్తి-విజయనగరం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల తుది జాబితా విడుదలైంది. ఆరు జిల్లాలో పరిధిలో 21,555 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 12,948 మంది పురుషులు కాగా, 8607 మంది మహిళలు ఉన్నారు. అత్యధికంగా విశాఖ జిల్లాలో 5,277 మంది, విజయనగరం జిల్లాలో 4,937 మంది, పార్వతీపురం మన్యంలో 2262 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1448 మంది టీచర్లు ఓటర్లుగా నమోదయ్యారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య 19,587 మంది కాగా, ఈ సారి స్వల్పంగా పెరిగారు. వచ్చే మార్చిలో జరుగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈ ఏడాది సెప్టెంబర్‌లో 30 నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. గతనెల 23న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించారు. ఆప్రక్రియ ముగియడంతో సోమవారం ఎన్నికల తుదిజాబితాను విడుదల చేశారు. 23న విడుదల చేసిన ముసాయిదా జాబితాలో 15,297 మంది ఓటర్లు ఉండగా, అభ్యంతరాలు స్వీకరించడంతో పాటు కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఇచ్చారు. ఈ సందర్భంగా 19 మంది ఓటర్లపై అభ్యంతరాలు రాగా, వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. కొత్తగా పురుషులు 3325మంది, మహిళలు 2,962 మంది కాగా మొత్తం 6,287 మంది దరఖాస్తు చేశారు. వీటిని పరిశీలించి అందరినీ ఓటర్ల జాబితాలో చేర్చారు. ఇదిలా ఉండగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల తరువాత మరోసారి ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం ఇవ్వనుంది.

జిల్లా	పురుషులు	మహిళలు	మొత్తం
విజయనగరం	3,100	1,837	4,937
శ్రీకాకుళం	3,275	1,554	4,929
పార్వతీపురంమన్యం	1,532	730	2,262
ఎఎస్ఆర్	891	557	1448
విశాఖపట్నం	2,403	2,874	5,277
అనకాపల్లి	1,747	1055	2,802
మొత్తం	12,948	8,607	21,555

65 లక్షల మందికి ప్రతినెలా పింఛన్లు

- 80 వేల మందికి ఒకేసారి మూడు నెలల పింఛను
- 5వేల మంది మహిళలకు భర్త పింఛను మంజూరు : మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంకోట



జొన్నవలసలో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న మంత్రి, ఎంపి, ఎమ్మెల్యే

రాష్ట్రంలో 65 లక్షల మందికి ప్రతినెలా సామాజిక పింఛను మొత్తాన్ని అందిస్తున్నట్లు రాష్ట్ర సెర్ప్, చిన్న,మధ్యతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ నెలలో 80వేల మందికి మూడు నెలల ఫించను మొత్తం ఒకేసారి అందిస్తున్నామని వెల్లడించారు. భర్త ఫించను పొందుతూ మరణిస్తే ఆ కుటుంబం ఏడాదిపాటు పింఛను మంజూరుకోసం వేచి వుండాల్సి వచ్చేదని, అయితే పింఛను పొందుతున్న భర్త మరణించిన వెంటనే అతని భార్యకు ఆ పింఛను మంజూరుచేసేలా ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఈనెల నుంచి రాష్ట్రంలో 5 వేల మందికి భర్త చనిపోయిన మహిళలకు పింఛను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. విజయనగరం రూరల్ మండలం జొన్నవలస, నగరంలోని 38వ వార్డు పరిధిలో బొబ్బాదిపేట ప్రాంతాల్లో పలువురికి సామాజిక భరోసా పింఛను మొత్తాన్ని మంత్రితో పాటు ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతి, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్ పర్సన్ పాలవలస యశస్విని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ దేశంలోనే మొదటి స్థానంలో నిలిపే లక్ష్యంతో ముఖ్యమంత్రి పనిచేస్తున్నట్టు పేర్కొన్నారు. ఎమ్మెల్యే అదితి గజపతి మాట్లాడుతూ నాడు ముఖ్యమంత్రి ఎన్టీఆర్ రూ.30తో ప్రారంభించిన పింఛను పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం నేడు రూ.4వేలు ఇచ్చే దిశగా అమలు చేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. కార్యక్రమాల్లో డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.కళ్యాణచక్రవర్తి, కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య, తహశీల్దార్ కూర్మనాధరావు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదు లక్ష్మివరప్రసాద్, మండల టిడిపి పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు , కార్యదర్శి గంటా పోలినాయుడు, ఎంపిటిసి పి. రాజేష్ బాబు, వేచలపు శ్రీనివాసరావు, కనకల రాంబాబు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గంద్రేటీ సత్యనారాయణ, బిజెపి నాయకులు బవిరెడ్డి శివ ప్రసాద్ రెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

భోగాపురం మండలం లింగాలవలసలో ఎమ్మెల్యే లోకం మాధవి, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, రాజాం, రేగిడి మండలాల్లో ఎమ్మెల్యే కోండ్రు మురళి పింఛన్లు పంపిణీ చేశారు.

స్టేట్ హైవేలుగా రెండు ప్రధాన రహదారులు

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలోని రెండు ప్రధాన రహదారులను రాష్ట్ర రహదారులుగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు చేస్తూ, సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్టులను రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. విజయనగరం- పాలకొండ (72 కిలోమీటర్లు) రహదారితో పాటు, నెల్లిమర్ల-రణస్థలం(28 కి.మీ) రహదారిని కూడా స్టేట్ హైవేగా ప్రతిపాదించినట్లు తెలిపారు. రోడ్లు భవనాల శాఖ ప్రగతిపై కలెక్టర్ తమ ఛాంబర్‌లో మంగళవారం సమీక్ష నిర్వహించారు. గుంతలు లేని రహదారులే లక్ష్యంగా జిల్లాలో 884 కిలోమీటర్ల మరమ్మతులకు 176 పనులను ప్రతిపాదించామని, ఇప్పటివరకు 31 పనుల్లో 259 కిలోమీటర్ల మేర మరమ్మతు పూర్తి అయ్యిందని తెలిపారు. మిగిలినవి ప్రగతిలో ఉన్నాయని చెప్పారు. పనులను వెంటవెంటనే పూర్తి చేయడంతోపాటు, బిల్లులను కూడా త్వరితగతిన అప్‌లోడ్ చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్అండ్‌బి ఎస్ఇ కాంతిమతి, ఇఇ ఎం.జేమ్స్, డిఇలు, జెఇలు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యుఎస్ ఇన్‌ఛార్జి ఎస్ఇగా కవిత

ప్రజాశక్తి-విజయనగరం

గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇన్‌ఛార్జి పర్యవేక్షక ఇంజినీర్ గా ఎస్.కవిత ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసింది. ఇంతవరకు ఇక్కడ ఎస్ఇగా బాధ్యతలు నిర్వహించిన ఉమాశంకర్ ఉద్యోగ విరమణ చేయడంతో విజయనగరం ఇఇ గా పనిచేస్తున్న కవితకు ఇంఛార్జి బాధ్యతలను అప్పగించారు.

పిఆర్ ఇన్‌ఛార్జి ఇఇగా రత్నకుమార్

విజయనగరం పంచాయతీ రాజ్ ఇంఛార్జి కార్యనిర్వహక ఇంజినీర్ గా ఎమ్ రత్నకుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతవరకు ఇక్కడ బాధ్యతలు నిర్వహిస్తున్న కెజిజె నాయుడు ఉద్యోగ విరమణ చేయడం రత్నకుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈయన పార్వతీపురం డిఇగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

'సీతం'లో ముగిసిన కార్యశాల

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వి.ఎన్.టెక్. ఇనిస్టిట్యూషన్ సహకారంతో 'ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ ఫ్రంట్‌ఎండ్' పై కార్యశాలను విజయవంతంగా నిర్వహించారు. కార్యశాల కు రిసోర్స్ పర్సన్‌గా కడవాటి మనోహర్ వ్యవహరించారు. విద్యార్థుల ప్రోగ్రామింగ్ నైపుణ్యాలను పెంపొందించడం, ఫ్రంట్‌ఎండ్ డెవలప్‌మెంట్‌కు అవసరమైన నైపుణ్యాలు అందించడంలో ఉపయోగపడింది. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు విద్యార్థుల పురోగతిని ప్రశంసించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి విద్యార్థుల ఉత్సాహం మరియు భాగస్వామ్యాన్ని ప్రశంసించారు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం వార్షిక కేలెండర్‌ను రాష్ట్ర చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు కంది వెంకటరమణ, కార్యదర్శి బి.బాల భాస్కరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.భూషణరావు, జిల్లా ఉపాధ్యక్షులు బాలాజీ పాణిగ్రాహి, జిల్లా సంయుక్త కార్యదర్శి పి.మేరీ, పట్టణ అధ్యక్షులు చింతల వెంకటసతీష్, అసోసియేట్ ప్రెసిడెంట్ బి.శ్రీనివాసరావు, పట్టణ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎ.సురేష్, ఉపాధ్యక్షులు, కె.కృష్ణ, పి.సునీల్, ఎం.కవిత, ఎస్.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

\- ప్రజాశక్తి, విజయనగరం టౌన్



ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం కేలెండర్‌ను జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ,ఉప ముఖ్య కార్య నిర్వాహణ అధికారి ఆర్. వెంకట్ రామన్, సంఘం జిల్లా అధ్యక్షులు సిహెచ్ మురళి, కార్యవర్గ సభ్యులు మరియు జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

\- ప్రజాశక్తి, విజయనగరంటౌన్



జిల్లా కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

న్యాయవాది మృతి కారకులను శిక్షించాలి

విజయనగరం బార్ అసోసియేషన్ నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అనంతపురం జిల్లా కోర్టు సీనియర్ అడ్వకేట్ బి.విశేషాద్రి మృతికి కారకులైన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని విజయనగరం బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. న్యాయవాదుల పట్ల దురుసుగా పోలీసులు ప్రవర్తించిన తీరు అత్యంత దుర్మార్గమని సీనియర్ న్యాయవాది తమ్మన్నశెట్టి ప్రశ్నించారు. న్యాయవాది మతికి నిరసనగా మంగళవారం కోర్టు ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదుల హక్కుల పరిరక్షణ చట్టాన్ని తీసుకురావాలని బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హరీష్ రావు కోరారు. బార్ అసోసియేషన్ మాజీ ప్రెసిడెంట్ చుక్క దామోదర్, సీనియర్ న్యాయవాదులు బొడ్డు సత్యనారాయణ, గేదెల సత్యం, డాక్టర్ పైలా రమేష్ రాజు, వైసిపి స్టేట్ లీగల్ సెల్ సెక్రటరీ గుణాన రాంబాబు, జనసేన జిల్లా లీగల్ సెల్ ప్రెసిడెంట్ డోల రాజేంద్ర ప్రసాద్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు అంజనీ కుమార్, బార్ సెక్రటరీ సంతోష్, దాసరి ఈశ్వరరావు బెల్లాన రవి, కోరాడ పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా దేహదారుఢ్య పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్టయిఫండరీ పోలీసు కానిస్టేబులు ఉద్యోగ నియామకాలకు సంబంధించి ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు జిల్లాలో 2వ రోజు చేపట్టిన దేహ దారుఢ్య పరీక్షలు ప్రణాళికా బద్ధంగా జరిగాయి. మంగళవారం 600 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 320 అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. ఎస్‌పి వకుల్‌జిందాల్ స్వయంగా పర్యవేక్షించారు. అభ్యర్థులకు ముందుగా హాల్ టిక్కెట్స్ ను పరిశీలించి, పోలీసు పరేడ్ గ్రౌండులోకి అనుమతించారు. అభ్యర్థులకు ముందుగా 1600 మీటర్ల పరుగును నిర్వహించి, నిర్దిష్ట సమయంలో పరుగును పూర్తి చేసిన అభ్యర్థులకు 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ నిర్వహించారు. విజయం సాధించిన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికేట్‌లను కంపూటర్లలో నిక్షిప్తం చేసి, పిఇటి పరీక్షల్లో ఉత్తీర్ణులు అయినట్లుగా మెమోరాండం జారీ చేస్తున్నట్లు ఎస్‌పి తెలిపారు. అదనపు ఎస్‌పి పి. సౌమ్యలత, ఎఆర్ అదనపు ఎస్‌పి జి. నాగేశ్వరరావు, డిఎస్‌పిలు, సిఐలు పాల్గొన్నారు.

కారు ఢీకొని కెజిబివి ఉపాధ్యాయిని మృతి

ప్రజాశక్తి - భోగాపురం



భోగాపురం కెజిబివి పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న ఎన్ కమలారాణి (55) మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పాఠశాలల విధులు ముగించుకొని భోగాపురం-2 సచివాలయం వద్ద రోడ్డును దాటుతుండగా శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్తున్న కారు ఢీకొంది. తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. ఎస్ఐ సూర్య కుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉమాశంకర్ సేవలు ఆదర్శనీయం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

గ్రామీణ నీటి సరఫరా పర్యవేక్షక ఇంజినీర్‌గా పనిచేస్తూ మంగళవారం ఉద్యోగ విరమణ చేస్తున్న ఉమాశంకర్ సేవలు అందరికీ ఆదర్శనీయమని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కొనియాడారు. ఉమాశంకర్ ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన విధులను అత్యంత సమర్థవంత ంగా, బాధ్యతతో నిర్వర్తిస్తారని చెప్పారు. అంకితభావం, నిబద్ధతకు ఉమాశంకర్ ప్రతిరూపమని పేర్కొన్నారు. నేటి తరం ఉమాశంకర్ పనితీరును చూసి స్ఫూర్తి పొందాలని కోరారు. ఉమాశంకర్ ఉద్యోగ విరమణ చేసినప్పటికీ, భవిష్యత్తులో కూడా ఆయన సేవలను వినియోగించుకుంటామని కలెక్టర్ చెప్పారు. సన్మాన గ్రహీత ఉమాశంకర్ మాట్లాడుతూ, పనిలో ఆనందాన్ని వెతుక్కుంటూ విధులను నిర్వహించాలని సూచించారు. ఏ పనిలోనైనా సానుకూల దృక్పథం విజయానికి సోపానమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ చౌదరి, విశ్రాంత సిఇ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కుమార్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు గోవిందరావు, ఉమాశంకర్ సతీమణి అరుంధతి, ఇతర కుటుంబ సభ్యులు, మిత్రులు, జిల్లా అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, రిటైర్డ్ అధికారులు పాల్గొన్నారు.



ఉమాశంకర్ దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

మున్సిపల్ బడ్జెట్‌కు ఏకగ్రీవ ఆమోదం

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో మంగళవారం చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అధ్యక్షతన బడ్జెట్ సమావేశం జరిగింది. బడ్జెట్ ప్రారంభ నిల్వ రూ.17.16 కోట్లుగా తీసుకుని వివిధ పద్దుల కింద ఆదాయం రూ.23.81కోట్లు, ఖర్చు రూ.28.02కోట్లు, అంతిమ నిల్వ రూ.12.94 కోట్లతో ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో టిడిపి కౌన్సిలర్ రాంబార్కి శరత్ మాట్లాడుతూ బడ్జెట్ వివరాలు పూర్తి స్థాయిలో పెట్టలేదన్నారు. టిడిపి ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పన్నులు డిమాండ్ ఎంత, పన్నులు వసూళ్లు ఎంత చేస్తున్నారో చెప్పాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి, వైసిపి కౌన్సిలర్లు

మున్సిపాలిటీకు ఏపీ రంగాల నుంచి ఎంత ఆదాయం వస్తుందో చెప్పాలని మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళి కోరారు. ఒక వార్డు ఉప ఎన్నికకు రూ.7లక్షలు ఖర్చుకు అంచనాలు పెట్టి 2025 మార్చిలో జరగనున్న సాధారణ మున్సిపల్ 31 వార్డుల్లో ఎన్నికలకు రూ.10లక్షలు ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జి.రామదేవి మాట్లాడుతూ మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో రోడ్లు, కాలువలు ఆక్రమణలు జరుగుతున్నా ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. ఆక్రమణలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆక్రమణలు తొలగించాలని ఉద్యోగులకు ఆదేశించినట్లు చెప్పారు. ఆక్రమణలు తొలగింపునకు కౌన్సిల్ సభ్యులంతా సంపూర్ణ మద్దతు ఇస్తారని వెనుకడుగు వేయకుండా ఆక్రమణలు తొలగించాలని కమిషనర్ రామలక్ష్మిను చైర్మన్ మురళి ఆదేశించారు. సమావేశంలో కమిషనర్ ఎల్.రామలక్ష్మి, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని భోగాపురం సిఐ రామకృష్ణ అన్నారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా మంగళవారం సిఐ రామకృష్ణ, పోలీసులు, విద్యార్థులు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల, ఆదిత్య విద్యాలయంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి జీవితాలు బాగు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బి.గణేష్, ఎంఇఒలు యుఎస్ఎన్ మూర్తి, ఈపు విజయ్‌కుమార్, ఆదిత్య స్కూల్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ సంక్షేమ సంఘం ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం నగరపాలక సంస్థ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులుగా సీనియర్ అకౌంటెంట్ వి.నరసింగ రాజు, కార్యదర్శిగా జూనియర్ అసిస్టెంట్ వివి ఎస్ఎన్ మూర్తి, కోశాధికారిగా కెవియస్. ప్రసాద్, జాయింట్ సెక్రెటరీగా బండి గురుమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య అభినందించారు.

రైతుల కోసమే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - శృంగవరపుకోట

రైతుల సమస్యలు పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహశీల్దార్ అరుణకుమారి అన్నారు. మండలంలోని సంత గౌరమ్మపేట, వినాయకపల్లి గ్రామాలలో మంగళవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ముందుగా గ్రామాలలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులను ఉద్దేశించి జనసేన నియోజకవర్గ నాయకులు వబ్బిన సన్యాసినాయుడు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉన్న భూముల సమస్యలను పరిష్కరించి, మీ భూమి పై మీకు హక్కులు కల్పించాలని కూటమి ప్రభుత్వం సంకల్పించి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులను రైతులు సద్వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంత గౌరమ్మపేట సర్పంచ్ గొంప కళావతి, వినాయకపల్లి సర్పంచ్ గనివాడ తులసి, విఆర్‌ఓలు అడివి నాయుడు, సబ్ రిజిస్ట్రార్ సిబ్బంది కె.కిరణ్ పలువురు పాల్గొన్నారు.

సిసి కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని చౌడువాడ పంచాయతీ పరిధిలోని కృష్ణాపురం జంక్షన్‌లో పోలీసులు మంగళవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని మాజీ ఎంపిటిసి మొంగం నాగబాబు, గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సిసి కెమెరాలు ఏర్పాటు వల్ల ఏదైనా ప్రమాదం జరిగినా, ఎటువంటి దొంగతనం జరిగినా సులభంగా నేరస్తులను గుర్తించవచ్చన్నారు. ఇటీవల కాలంలో గ్రామాల్లో కూడా దొంగతనాలు, ప్రమాదాలు ఎక్కువగా జరగడంతో సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయనతోపాటు కొయ్య యల్లన్నరెడ్డి, మహిళా పోలీసు, సచివాలయ ఉద్యోగులు గ్రామస్థులు, వ్యాపారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని శివాలయం వీధి అంగన్వాడీ కేంద్రాన్ని ఐసిడిఎస్ సిడిపిఒ జె.విజయలక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు. ప్రీ స్కూల్ రికార్డులను పరిశీలించారు. పిల్లలకు పెట్టె భోజనం నాణ్యతను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని కోరారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శ్మశాన వాటిక ప్రహరీ పూర్తికి చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక రాజానగర్ కాలనీ శ్మశాన వాటికలో అసంతృప్తిగా ఉన్న ప్రహరీ గోడ నిర్మాణం వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. శ్మశాన వాటికను మంగళవారం ఆమె పరిశీలించారు. ప్రహరీ గోడ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు. బండారు వీధిలో రోడ్లుపై పశువులను కట్టడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై పశువులు కడుతున్న యజమానులకు నోటీసులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా రమణ మహర్షి జయంతి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక శ్రీ గురు చైతన్య ధామంలో రమణ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి జరిగిన సత్సంగంలో గురువు ఆవశ్యకత, సనాతన ధర్మం విశిష్టత, మానవ జన్మ సార్థకత అంశాలపై వ్యవస్థాపకులు గోవింద్ వివరించారు. గీతాపారాయణం చేశారు. సాధకులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

యుటిఎఫ్ కేలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తెర్లాం

యుటిఎఫ్ మండల శాఖ నూతన సంవత్సర కేలెండర్‌ను తహశీల్దార్ జి. హేమంత్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించి యుటిఎఫ్ నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. తమ వృత్తిలో శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు జి.మునిస్వామి, జి.శంకర్రావు, సిహెచ్ రమణమూర్తి, ఉమా రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఘనంగా వన మహోత్సవం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికలు వసతి గృహంలో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎస్ లక్ష్మితోపాటు వసతి గృహంలో ఉన్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలకు రేషన్ సక్రమంగా అందాలి

ప్రజాశక్తి- తెర్లాం

ప్రభుత్వ పాఠశాలలకు రేషన్ దుకాణాల నుంచి బియ్యం సక్రమంగా అందేలా చూడాలని తహశీల్దార్ జి. హేమంత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆయన రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు సక్రమంగా బియ్యం అందడం లేదని తన దృష్టికి వచ్చిందని అలా జరగడానికి వీలులేదని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలకు కూడా కొంతమంది డీలర్లు సకాలంలో తగు సరుకులు అందించడం లేదని మండిపడ్డారు. మళ్లీ ఇటు వంటివి పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

'కడలి'కి సత్కారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జరజాపుపేటకు చెందిన రిటైర్డ్ హెచ్‌ఎం, చిత్ర కారుడు కడలి ప్రకాశరావుని ప్రపంచ తెలుగు రచయితల మహాసభ సత్కరించింది. మంగళవారం విజయవాడలో పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రాంగణంలో 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభ కవి సమ్మేళనంలో కడలి ప్రకాశరావు రచించిన వంద 'కడలి కవితా ప్రసూనాలు' అనే పుస్తకానికి ఆయనను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో రావి రంగారావు, కిలపర్తి దాలినాయుడు, బుర్రి కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు. కడలి ప్రకాశరావుని గ్రామస్థులు అభినందించారు.

గోప్యంగా గోదాం తనిఖీ

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని బైరిపురంలో గల రాష్ట్ర గిడ్డంగుల సంస్థను, ఆ సంస్థ రీజినల్ మేనేజర్ రాజేశ్వరి మంగళవారం అత్యంత గోప్యంగా తనిఖీ చేసినట్లు భోగట్టా. మంగళవారం ప్రజాశక్తి ' గోదాం నుంచి రేషన్ బియ్యం పక్కదారి' అనే వార్తకు స్పందించి ఆమె ఈ తనిఖీ నిర్వహించినట్లు సమాచారం. ఈ పరిశీలనలో గోడౌన్‌లో స్టాక్ ఉన్న బియ్యం బస్తాలు, సంబంధిత రికార్డ్స్‌ను పరిశీలించినట్లు తెలిసింది. అయితే ఎవరికి తెలియకుండా ఇంత గోప్యంగా తనిఖీ చేయటంలో ఆంతర్యం ఏమిటో అని పలువురు చర్చించుకుంటున్నారు.

వాతావరణ అనుకూల పంటలే వేయాలి

బొబ్బిలి రూరల్: రైతులు ఆయా ప్రాంతాలు, మట్టి సారవంతం, వాతావరణ అనుకూలత పంటలే వెయ్యాలని జిల్లా వనరుల సహాయ సంచాలకులు సిహెచ్.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మెట్టవలస, కృష్ణాపురంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వర్షానికి ఇబ్బంది అయిన మొక్కజొన్న, అపరాల పంటలకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఎడిఎ యం.శ్యాంసుందర్, గ్రామ వ్యవసాయ సహకులు రాజ్ శేఖర్ రైతులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మామిడివలస, నర్సాపురం గ్రామాల్లో మంచినీటి సమస్యను పరిష్కరించడంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఘోరంగా విఫలమయ్యారని మామి డివలస ఎంపిటిసి మడక తిరుపతినాయుడు, నర్సాపురం సర్పంచ్ కోట వెంకటనాయుడులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు గ్రామానికి వచ్చి వెళుతున్నారే తప్ప సమస్యను పరిష్కరించడం లేదన్నారు. రొంపల్లిలో అంగన్వాడీల పనితీరు అస్తవ్యస్తంగా ఉందని, గ్రామంలో ఉన్న 3 కేంద్రాలు సమయపాలన పాటించకపోడంతోపాటు ఆహారం కూడా సకాలంలో పిల్లలకు అందించడం లేదని ఎంపిటిసి భవిరెడ్డి శంకరరావు సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఉన్నతాధికారులు పర్యవేక్షణాలోపం ఎక్కువగా ఉందని తెలిపారు. దీనిపై ఐసిడిఎస్ పిఒ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఆ కేంద్రాలను తనిఖీ చేసి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వెలుగు ఆధ్వర్యంలో పనిచేస్తున్న విఒఎలను అక్రమంగా తొలగిస్తే ఆందోళన చేపడతామని రామభద్రపురం ఎంపిటిసిలు భవిరెడ్డి చంద్ర, వసంతుల తిరుపతిరావులు హెచ్చరించారు. మిర్తివలస గ్రామంలో రోడ్డు ఆక్రమణలు జరుగుతున్నాయని దీనిపై చర్యలు తీసుకోవాలని మిర్తివలస సర్పంచ్ మజ్జి రాంబాబు కోరారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి వెంకటరమణ, కోఆప్షన్ సభ్యులు జైకిరణ్, తహశీల్దార్ ఆకుల సులోచనారాణి, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతమ్మ, ఎంపిడిఒ రత్నం, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

యువత వ్యసన విముక్తులు కావాలి : సిఐ

ప్రజాశక్తి - రామభద్రపురం

యువత వ్యసన విముక్తులై క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు పిలుపు నిచ్చారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మంగళవారం ఎనుబరువు గిరిజన గ్రామంలో ఉచితంగా వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిశిఖర ప్రాంతాల్లో నివసిస్తున్న యువత ఉన్నత చదువులు చదివి వారికి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా చెడు వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా చదువులేని వారు తీరిక సమయాల్లో క్రీడలపై శ్రద్ధ కనబరచి ఆ రంగంలో ప్రతిభ సాధించాలన్నారు. అందుకోసమే ఇప్పుడు ఈ కిట్లు అందిస్తున్నట్లు వివరించారు. సంకల్పంలో భాగంగా మాదక ద్రవ్య వినియోగం, విక్రయాలు, మహిళా చట్టాలు, ఉమెన్ ట్రాఫికింగ్, రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో నాటుసారా, మద్యం బెల్టుషాప్‌లు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రావివలస పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, గిరిజన యువత, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


యువతకు వాలీబాల్ కిట్లను అందిస్తున్న సిఐ నారాయణరావు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొత్తవలస

గ్రామాల అభివృద్ధే టిడిపి కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మంగళవారం మండలంలోని చింతలపాలెంలో రూ.45లక్షలతో నిర్మించనున్న రోడ్లు, డ్రైనేజీలు సహా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందిన్నారు. అనంతరం పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి గ్రామస్తులు తీసుకురాగా వాటిపై కూడా ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాకెన నవీన్ పాత్రుడు, వార్డు మెంబర్లు, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

క్షయ నిర్మూలనే ధ్యేయంగా మనమంతా పనిచేయాలని తూర్పుగోదావరి జిల్లా టిబి యూనిట్ అధికారి డాక్టర్ వసుందర అన్నారు. మంగళవారం మండలంలోని రెల్లివలస, గోవిందపురం ఆసుపత్రులను ఆమె పరిశీలించారు. 100 రోజుల్లో టిబి నిర్మూలన కార్యక్రమం జరిగే విధానం గురించి గోవిందపురం డాక్టర్ ఎ. వెంకటసుధాని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్ కార్డులను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భోగాపురం టిబి యూనిట్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: టిబిపై భయం పోగొట్టే భాధ్యతను వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని టిబి ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రశాంత్ అన్నారు. మంగళవారం పిరిడి పిహెచ్‌సిలో 100 రోజుల టిబి కంట్రోల్‌పై ఎంఎల్‌పి హెచ్‌ఎస్‌తో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి సోకకముందు వచ్చే అనుమానాలు నివృత్తి చేసుకొనేందుకు చేయాల్సిన పరీక్షలు నిర్వహించి వచ్చినట్లు నిర్ధారణ అయిన తరవాత రోగికి తగిన సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ వంశీ, డాక్టర్ భరద్వాజ్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- బొబ్బిలి



నియోజక వర్గంలో దీర్ఘకాలికంగా ప్రజలు, రైతులను పీడిస్తున్న సమస్యల పరిష్కారానికి 2025లో చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ నియోజకవర్గంలో పాడైపోయిన రోడ్లు బాగు చేసి ప్రజలు, వాహనదారులు ఇబ్బందులను తొలగిస్తామని చెప్పారు. పారాది వంతెన పూర్తి చేస్తామన్నారు. సాగునీటి రంగాన్ని ప్రక్షాళన చేసి రైతులకు సాగునీరు అందిస్తామని చెప్పారు. గ్రోత్ సెంటర్లో నూతన పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.

క్వారీకి అనుమతులు ఇవ్వొద్దు

-ప్రజాశక్తి- మెంటాడ

కొండలింగాలవలస పంచాయతీ పరిధిలో బోడిమెట్ట ప్రాంతంలో అపారమైన గ్రానైట్ ఖనిజ సంపద ఉన్న నేపథ్యంలో అక్కడ క్వారీకి అనుమతి ఇవ్వొద్దని గిరిజన సంఘం కార్యదర్శి టి సోములు, సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు కోరారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా తమిళనాడుకు చెందిన, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన వ్యక్తులు కలిపి గిరిజనులు కళ్ల కప్పి తాము సాగుచేస్తున్న భూములు నష్టం వాటిల్లేలా క్వారీ తవ్వకాలకు సిద్ధమపడుతున్నారన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా క్వారీ కోసం సర్వే చేపట్టడం సరికాదని, స్థానిక నేతలు మద్దతు లేకుండా ఈ తతంగం చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ క్వారీ పనులకు అనుమతులు ఇస్తే తాగునీరు, పంటలు పండే పరిస్థితి లేదని, దీనివల్ల పశువులు, ప్రజలు పలు రకాల అంటువ్యాధుల బారిన పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితుల నెలకొంటాయని చెప్పారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మండల సీనియర్ అసిస్టెంట్‌కు అందజేశారు. కార్యక్రమంలో చల్ల సత్యం, సొంట్యాన గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు పహారాలో పాల్ట్రీ


కొనసాగుతున్న సమ్మె

ప్రజాశక్తి-చీపురుపల్లి

చీపురుపల్లి సర్కిల్ పరిధిలో ఉన్న పోలీసులందరూ వెంకటరామా పౌల్ట్రీ వద్దే పహారా కాస్తున్నారు. డిసెంబరు 31 అయినప్పటికీ చీపురుపల్లి లా అండ్ ఆర్డర్ సమస్య కంటే పెత్తందార్లుకే కొమ్ము కాస్తారనేదానికి ఇదొక ఉదాహరణ. గత ఐదు రోజులుగా మండలంలోని కర్లాం గ్రామ సమీపంలో ఉన్న వెంకటరామా పౌల్ట్రీ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోగా తిరిగి తమ సమ్మెను పోలీసులతో అణగదొక్కేందుకు యాజమాన్యం చూస్తోందని కార్మికులు చెబుతున్నారు. ఇది ఇలా ఉండగా డిశంబరు 31న చీపురుపల్లిలో ఎలాంటి సంఘటనలు జరుగుతాయోనని ఆలోచించకుండా సర్కిల్‌లో ఉన్న సిఐతో సహా ఎస్‌ఐలు సైతం పౌల్ట్రీ వద్దే మంగళవారం పహారా కాస్తుండడం పట్ల స్థానిక ప్రజలు పోలీసులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సింహ గర్జనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- సంతకవిటి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దళిత నాయకులు

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా జనవరి 5న విజయ నగరంలో జరుగు మాలల సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత నాయకులు మన్నేన రమేష్, బవిరి శ్రీనుబాబు కోరారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని ఎం.ఆర్ అగ్రహంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ త్యాగాల బాట నుంచి రేపటి పిల్లల భవిష్యత్తు కోసం మాలలంతా ఐక్యంగా పనిచేసి వర్గీకరణను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్‌సిలను వేరు చేసే కుట్ర నేపథ్యంలోనే వర్గీకరణ అంశం తెరపైకి తీసుకువచ్చారని తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి కులగణన చెయ్యకుండా వర్గీకరించడం అశాస్త్రీయం అన్నారు. మాలలను విడదీసి రాజ్యాధికారానికి దూరం చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే సుప్రీంకోర్టు పునఃపరిశీలన చేయాలని కోరారు. అనంతరం మాలలంతా ఐక్యతతో వర్గీకరణను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యజ్జల భాస్కర్, కారు సింహచలం, బంగారి, హరిబాబు, లక్ష్మి, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావు సేవలు స్ఫూర్తిదాయకం

మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి - విజయనగరం టౌన్


వెంకటేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న ఉద్యోగులు

టెక్నికల్ అధికారి పట్నాల వెనకటేశ్వరావు మున్సిపా లిటీకి అందించిన సేవలు స్ఫూర్తి దాయకమని మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ నల్లనయ్య, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌వివి రాజేష్ అన్నారు. ఉద్యోగ విరమణ సంధర్బంగా నగర పాలక సంస్థ ఉద్యోగులు ఆధ్వర్యంలో జరిగిన సత్కార సభలో వారు మాట్లాడుతూ 42 ఏళ్లగా తన సొంత ఊరిలో ఉండి ఉద్యోగ సేవలు అందించడం అభినందనీయమన్నారు. నగర పాలక సంస్థ అభివృద్ధి పనుల్లో, ఉద్యోగులకు దిశా, నిర్దేశం చేయడంలో ఆయన ఆదర్శంగా నిలిచారన్నారు. నేటి తరం ఉద్యోగులు ఆయన అందించిన సేవలను ఆదర్శంగా తీసుకుని నగరాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం ఉద్యోగులు, అధికారులు, కాంట్రాక్టర్లు, కార్పొరేటర్లు, ఆయన మిత్రులు వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు టెస్టు పేపర్లు వితరణ

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని చల్లపేట హైస్కూల్ ఆవరణలో పదో తరగతి ఇంగ్లీష్, తెలుగు మీడియం విద్యార్థులు 250 మందికి మంగళవారం టెస్టు పేపర్లను వితరణగా అందించారు. కొండపల్లి సత్యనారాయణ, వెంకటమ్మ దంపతులు 15వేల రూపాయలు విలువ చేసే మెటీరియల్‌ను యుటిఫ్ నాయకులు జెవిఆర్ కే ఈశ్వరరావు, తలారి అశోక్‌కుమార్, పాపారావు, చక్రదర్, కాళ్ల సన్యాసిరావు, పైడిరాజు, నాగమణి తదితరులు ఆధ్వర్యంలో ఎంఇఒ శర్మ చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. వితరణ చేసిన దంపతులను మండల ఉపాధ్యాయులు అభినందించారు.

కెజిజె నాయుడు సేవలు ఆదర్శనీయం

ప్రజాశక్తి- విజయనగరం


కెజిజె నాయుడు దంపతులను సత్కరిస్తున్న ఉద్యోగులు

పంచాయతీరాజ్ కార్యనిర్వహక ఇంజినీర్ కెజి జగన్నాథనాయుడు సేవలు అందరికి ఆదర్శం అని వక్తలు కొనియాడారు. ఆయన ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా మంగళవారం స్థానిక జెడ్‌పి సమావేశ మందిరంలో డిఇ వసంత అప్పారావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిధిలుగా పాల్గొన్న పిఆర్ ఎస్ఇ శ్రీనివాస్ రావు, రిటైర్డ్ ఎస్ఇలు విఎస్ఎన్ మూర్తిలు మాట్లాడుతూ నాయుడు ఎవరినీ నొప్పించకుండ తాను ఇబ్బంది పడకుండా అనుకున్న పనులను విజయవంతంగా పూర్తి చేయించుకొనేవారని తాను ఎవరిపైనా కోపపడకుండా ప్రశాంతంగా లక్ష్యాలను అదిగమించే విధంగా పనులు చేయించేవారని చెప్పారు. డిపార్ట్‌మెంట్‌లో తనకంటూ ఒక ప్రత్యేకత సంపాదించుకొని సక్సస్‌ఫుల్ ఇంజనీర్‌గా పదవీ విరమణ చేస్తున్నారని వారు కొనియాడారు. తన శేషజీవితం సుఖ సంతోషాలతో సాగాలని కోరారు. జగన్నాథనాయుడు మాట్లాడుతూ తన ఉద్యోగం విజయవంతంగా పూర్తి చేయాడానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన్ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీరులు రిటైర్డ్, అధికారులు కుటుంబ సభ్యులు ఆయన మిత్రులు ఇతర సిబ్బంది పాల్గొని నాయుడుకు అభినందనలు తెలిపారు.

విద్యార్థుల్లో డ్రాప్ అవుట్స్‌ను నివారించాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

విద్యార్థుల్లో డ్రాప్ అవుట్స్‌ను నివారించాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంఇఒ -1 బి.నర్సింగరావు ఆధ్వర్యంలో మండలలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, స్కూల్ చైర్మన్‌ల శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ప్రతి సంవత్సరం డ్రాప్ అవుట్స్ పెరుగుతున్నాయని వాటిని ఎలా తగ్గించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఇఒ -2 పాదం లక్ష్మి, హెచ్‌ఎంలు, స్కూల్ కమిటీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని ఎంఇఒ ఎం. శ్రీదేవి అన్నారు. మంగళవారం ఏపీ మోడల్ స్కూల్‌లో మండల స్థాయి పాఠశాల యాజమాన్య కమిటీ శిక్షణా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మరో ఎంఇఒ బి.శ్రీనివాసురావు మండలంలోని ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలు ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసి సభ్యులు పాల్గొన్నారు.

తెర్లాం: మండల కేంద్రంలోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మంగళవారం మండలంలో ఉన్న స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్‌లకు, ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. తహశీల్దార్ జి.హేమంత్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు మంచి విద్యను అందిస్తూ విద్య తోపాటు క్రమశిక్షణ నేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్లు, ఎంఇఒ పాపారావు, ప్రధానో పాధ్యాయులు, యుటిఎఫ్ అధ్యక్షులు మునుస్వామి శంకర్రావు పాల్గొన్నారు.

వేపాడ: వేపాడ హైస్కూల్లో మండల విద్యాశాఖ అధికారులు జి.జగదీశ్వరరావు, పి.బాల భాస్కరరావుల ఆధ్వర్యంలో స్కూల్ కమిటీ సభ్యులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ పాఠశాల అభివృద్ధిలో ఎస్ఎంసి కమిటీల బాధ్యత చాలా కీలకమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత ప్రధానోపాధ్యాయులు, పాల్గొన్నారు.

బొండపల్లి: పాఠశాల అభివృద్ధిలో పాఠశాల యాజమాన్య కమిటీలు మమేకం కావాల్సిన అవసరం ఉందని ఎంఇఒ కె శోభారాణి అన్నారు. మంగళవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 అల్లు వెంకటరమణ, గొర్లె శ్రీనివాసరావు, అంజురు సతీష్, పాల్గొన్నారు.

రేగిడి: పాఠశాల అభివృద్ధికి స్కూల్ మానిటరింగ్ కమిటీ ఎంతో కీలకమని ఎంఇఒలు వరప్రసాదరావు, ఎరకయ్య అన్నారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసి చైర్మన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చుక్క వైకుంఠరావు, ఎందువ సీత నాయుడు, చింతా శ్రీధర్, సంకిలి పాఠశాల చైర్మన్ గోల్వే సుధీర్ పాల్గొన్నారు.

రామభద్రపురం: స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మెన్, పాలకవర్గ సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని ఎంఇఒ తిరుమల ప్రసాద్ కోరారు. స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఎస్ఎంసి చైర్మన్‌లకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 పెంటయ్య, ట్రైనింగ్ టీచర్లు శ్రీనివాసరావు, సుదర్శనరావు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: ప్రభుత్వ పాఠశాలల ఎస్ఎంసి కమిటిలు బాధ్యతగా వ్యవహరించాలని ఎంఇఒలు యుఎస్ఎన్ మూర్తి, ఈపు విజయ్ కుమార్ సూచించారు. మంగళవారం జరజాపు పేట జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో ఎస్ఎంసి కమిటీలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. స్టేట్ రిసోర్స్ పర్సన్ ఎ.ప్రవీణ్ కుమార్ శిక్షణా తరగతులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రిషోర్స్ పర్సన్లు వాసు, రాజు, కిరణ్, సిఆర్పీలు ఎం. అచ్చుం నాయుడు, జి. లక్ష్మణరావు, బివి రమణ, ఎం.రేవతి, ఈశ్వరరావు, పాల్గొన్నారు.

బొబ్బిలి: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొంచాలని ఎంఇఒ సిహెచ్ లక్ష్మణరావు కోరారు. బొబ్బిలి మున్సిపాలిటీలోని గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ పాఠశాలలో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఎంఇఒ వాసు, పాల్గొన్నారు.

డెంకాడ: పాఠశాల యాజమాన్య కమిటీ శిక్షణా కార్యక్రమాన్ని మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ భవానీ, ఎంఇఒ కె.వెంకట రమణ మాట్లాడగా, శిక్షణా కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్‌గా పద్మాకర్, శోభన్ బాబు,రాంబాబు వ్యవహరించారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసి సభ్యులు, సిఆర్‌పిలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నలుగురికి డాక్టరేట్‌లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయం నుంచి నలుగురికి డాక్టరేట్లు లభించాయి. 2022 సంవత్సరంలో నూతనంగా ఏర్పడిన జెఎన్‌టియు గురజాడ విశ్వవిద్యాలయం నుండి ఇప్పటివరకు నలుగురికి అధికారికంగా డాక్టరేట్ పట్టాలు ప్రదానయ చేసినట్లు రిజిస్ట్రార్ ఆచార్య జి.జయసుమ తెలిపారు. ఇసిఇ విభాగం నుండి ఆచార్య కె.బాబులు పరిశోధక మార్గదర్శనంలో 'ఫాల్ట్ డయాగ్నోసిస్ అండ్ ఎనాలిసిస్ అఫ్ అనలాగ్ సర్క్యూట్స్ యూసింగ్ వేరియస్ ఫాల్ట్ మోడలింగ్ అండ్ ఆప్టిమైజషన్ టెక్నిక్స్' అనే అంశంపై డాక్టర్ ఆర్.గురునాథ , 'వి.ఎల్.ఎస్.ఐ ఇంప్లీమెంటేషన్ అండ్ ఆప్టిమైజషన్ అఫ్ ఫాస్ట్ ఫిర్ డిజిటల్ ఫిల్టర్ స్ట్రక్చర్స్ ఫర్ ఇసిజి సిగ్నల్' అనే అంశంపై డాక్టర్ పుష్పలత పొండ్రేటి ఇఇఇ విభాగం నుంచి డాక్టర్ డి .విజయకుమార్, డాక్టర్ వివిఎస్ వకుళ సంయుక్త పరిశోధక మార్గదర్శనంలో 'సెల్ఫ్ ఆర్గనైజ్డ్ ఫుజ్జీ కంట్రోల్లోర్ అస్ ఆటోమేటిక్ జనరేషన్ కంట్రోల్లోర్ అండ్ వర్చ్యువల్ ఇనెరిస్య కంట్రోలర్' అనే అంశంపైనా, డాక్టర్ శ్వేతా కన్నెపల్లి, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం నుండి ఆచార్య. ఎన్.హరిబాబు, జి.స్వామినాయుడు సంయుక్త పరిశోధక మార్గదర్శనంలో 'ఇకెప్ ప్రభావం మెకానికల్, థర్మల్, స్ట్రక్చరల్ మరియు వేర్ ప్రవర్తనపై రెడ్ మడ్ పార్టికల్ రీఫోర్స్డ్ ఎఎ 5083 మేట్రిక్స్ కాంపోజిట్లు స్టిర్ కాస్టింగ్ ద్వారా సంశ్లేషణ' అనే అంశంపై డాక్టర్ బ్రహ్మానందరెడ్డి సత్తి చేసిన పరిశోధనలకు గాను పిహెచ్‌డి పట్టాలు పొందారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని డైరెక్టర్ అఫ్ ఎవల్యూషన్ ఆచార్య కె.బాబులు, విశ్వవిద్యాలయ అధికారులు అభినందించారు.